తొలి అక్షరం

తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 01 సంచిక - 279 పేజీలు - 6 శుక్రవారం 30 ఆగస్టు 2024

విలేకరులు కావలెను

తొలి అక్షరం తెలుగు దిన పత్రిక

వినూత్నంగా వెలువడుతూ, విశేష ప్రజాధరణ పొందుతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రికకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో విలేకరులు కావలెను.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను tholiaksharam@gmail.comకి మెయిల్ చేయగలరు. సీనియర్లకు పాధ్రాన్యం, కొత్తవారికి కూడా అవకాశం,నియామకాలు జరుగుతున్నాయి వెంటనే సంప్రదించండి.

హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా

గణేష్ ఉత్సవాలు...

- అనుమతులు తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్
- అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో ముందుకు సాగాలి
- గణేష్ ఉత్సవ సమితి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సుప్రీంకోర్టు నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలి

తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 29: హైదరాబాద్ నగరం తొలి నుంచి మత సామరస్యానికి, ప్రశాంతతకు పేరు పొందిందని, ఆ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాల నిర్వహణ ఉండాలని, ఇందుకోసం ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి మండప నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనో అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం తరఫున పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ,నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు సైతం మండప నిర్వాహకులతో సమన్వయంతో ముందుకు సాగాలన్నారు.నిమజ్జన మహోత్సవాన్ని

వివరాలు 2లో

రుణమాఫీ వాపస్ పేరుతో

కొత్త డ్రామా

- ఎక్స్ వేదిగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 29: కేసీఆర్ రైతును రాజును చేస్తే.. మీరు అనుమానిస్తూ వేధిస్తున్నారని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతో కొత్త డ్రామాకు తెరతీశారని, ఇచ్చేది పక్కన బెట్టి వాపస్ దృష్టి సారించారని విమర్శించారు. ఒక్క రుణమాఫీకి వంద కొర్రీలు పెడుతున్నారన్నారు. సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతో రైతులను అవమానిస్తున్న రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. సెల్ఫీ దిగి నేను రైతునని రైతు

వివరాలు 2లో

స్పోర్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు

అన్ని సౌకర్యాలు

2లో

హైడ్రా అంటే ఓ డ్రామా: ఈటల..

- పేదల ఇళ్లు కూలకొడితే అడ్డుకుంటా
- రేవంత్‌ను హెచ్చరించిన బిజెపి ఎంపి ఈటల

తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 29: హైడ్రా అంటే ఓ డ్రామా అంటూ ఈటెల రాజేందర్ మండిపడ్డారు. ఒక మంత్రి గానో, అయిదేళ్ల పాటు ఎంపిగానో పనిచేస్తే సీఎం రేవంత్ రెడ్డి పేదోళ్ల బాధ తెలిసేది అంటూ మండిపడ్డారు. నేడు ఆయన హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ, బఫర్ జోన్ లో ఉన్నారంటూ 40 ఏళ్ల తరువాత పేదోళ్ల ఇండ్ల కు నోటీస్ లు ఎలా ఇస్తారన్నారు. పేదోళ్ల జోలికి వస్తే మేము ఊరుకొం, ఖబర్దార్ అంటు ఈటెల రాజేందర్ హెచ్చరించారు.మీకు తెలిసిందల్లా ఒక ఎన్ కన్వెన్షన్ కూల్చివేత మాత్రమే కానీ హస్మత్‌పేట,

వివరాలు 2లో

తండ్రి కెసిఆర్‌ను

కలిసిన కవిత

- గుండెలకు హత్తుకున్న కెసిఆర్
- ఇద్దరిలోనూ భావోద్వేగ క్షణాలు

తొలి అక్షరం/గజ్వేల్,ఆగస్టు 29: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బెయిల్ వచ్చిన తరువాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ని గురువారం కలిశారు. హైదరాబాద్ నుంచి ఉదయాన్నే బయల్దేరిన ఆమె ఎర్రవల్లిలో ఉన్న ఫాంహౌజ్‌కి చేరుకున్నారు. ఆమె వెంట భర్త అనిల్, కుమారుడు కూడా ఉన్నారు. ఆమెకు కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. కవితకు బెయిల్ రావడంపై కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్.. కవితను చూసిన వెంటనే ఆమెను గుండెలకు హత్తుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం ఆమె కేసీఆర్ పాదాలకు నమస్కరించారు. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంపాలవ్వడం, మరోవైపు కవిత అరెస్ట్, ఇంకోవైపు లోక్ సభ ఎన్నికల్లో సున్నా సీట్లకు పరిమితం కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు నిరాశలో మునిగిపోయాయి. అయితే చాన్నాళ్ల తరువాత కేసీఆర్ ముఖంలో ఇవాళ ఉత్సాహం, సంతోషం కనిపించిందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కవితను అక్రమంగా నిర్బంధించారని చివరికి సత్యమే గెలిచిందని చెబుతున్నారు. కవిత రాకతో ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసం కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు ఉన్నారు. అయితే జీవన్ రెడ్డి కవిత కాళ్లకు నమస్కారం చేయడం విమర్శలకు దారితీస్తుంది. కవిత ఇంట్లోకి ప్రవేశించే ముందు అక్కడే ఉన్న జీవన్ రెడ్డి ఆమెకు పాదాభివందనం చేశారు.

పూర్తి స్థాయిలో

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు

- సబ్‌ప్లాన్ అమలుకు యాక్షన్ ప్లాన్ సిద్దం చేయండి
- దళిత గిరిజన జీవితాల్లో మార్పు వచ్చేలా చర్యలు
- ఉన్నతస్థాయి సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి

2లో

ఎంపాక్ కిట్‌ను ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

తొలి అక్షరం/అమరావతి,ఆగస్టు 29:ఎంపాక్స్ (మంకీపాక్స్) వ్యాధి నిర్ధారణకు ఏపీ మెడ్‌టెక్ జోన్ అభివృద్ధి చేసిన ఆర్టీ–పీసీఆర్ కిట్ 'ఎర్బాఎండీఎక్స్'ను ఏపీ సీఎం చంద్ర బాబు ఆవిష్కరించారు. మెడ్‌టెక్ తమ భాగస్వామి ట్రాన్సేషియా డయాగ్నస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి దీన్ని తయారు చేసింది. ఈ విషయాన్ని సీఎం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. మంకీపాక్స్ ఆర్టీ–పీసీఆర్ కిట్.. ప్రపంచవేదికపై 'మేక్‌ఇన్ ఏపీ' ఖ్యాతిని ఘనంగా చాటుతోందన్నారు. ఈ కిట్ తయారీ బృందాన్ని సీఎం అభినందించారు. కిట్‌లోని లయోఫయలైజ్డ్ కాంపోనెంట్స్ రవాణాకు అనుకూలంగా ఉన్నాయని, అంటువ్యాధుల్ని సమర్థంగా ఎదుర్కోవడంలో ప్రభుత్వ సన్నద్ధతను ఈ కిట్ చాటుతోందని పేర్కొన్నారు.

హైడ్రా కోరలు మరింత పదను

- మరిన్ని అధికారాల అప్పగింత దిశగా ప్రభుత్వం
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎస్ శాంతి కుమారి

2లో

రాష్ట్రంలో 83 మంది డీటీలకు తహశీల్దార్లుగా పదోన్నతి

తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 29: తెలంగాణలో 83 మంది డిప్యూటీ తహశీల్దార్లకు తహసీల్దార్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది . ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.సీఎం, రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏకు టీజీటీఏ ధన్యవాదాలు తెలిపింది. తెలంగాణ ఉద్యోగుల చైర్మన్ లచ్చి రెడ్డి, టీజీటీఏ కృషి ఫలితంగానే డీటీలకు తహశీల్దార్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించిందని తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. గతంలోనూ పదోన్నతులను ఇప్పించిన చరిత్ర టీజీటీఏకే ఉందన్నారు. ఈ మేరకు తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ, సీఎం రేవంత్, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌కి, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూసే డీటీలకు తహశీల్దార్లుగా అవకాశం కల్పించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద

● 18 గేట్లు ఎత్తి నీటి విడుదల

తొలి అక్షరం/నాగార్జున సాగర్,ఆగష్టు 29 : నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు మరోసారి జల ప్రవాహం కొనసాగుతోంది. ఈ క్రమంలో అధికారులు 18 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం రాత్రికి సాగర్ వద్ద ఇన్ ఎ÷-లో, అవుట్ ఎ÷-లో 1,94,758 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 590 అడుగులుగానే ఉంది. జలాశయ పూర్తి స్థాయి, ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్ట్ వద్ద విద్యుత్ కాంతులతో జల ప్రవాహం కనువిందు చేస్తోంది. మరోవైపు, శ్రీశైలం జలాశయంలోనూ వరద కొనసాగుతోంది. అధికారులు 6 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో 3,11,953 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 1,81,008 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి, ప్రస్తుత నీటి మట్టం 885 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి, ప్రస్తుత నీటి నిల్వ 215.8070 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్ట్ వద్ద జలకళతో కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. విద్యుత్ ఉత్పత్తి అనంతరం 68,807 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ఓటుకు నోటు కేసు బదిలీని కొట్టేసిన సుప్రీం

తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగష్టు 29 : ఓటు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలన్న బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. కేసు విచారణ తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్ కు బదిలీ చేయాలని కోరుతూ చాలా రోజు క్రితం జగదీష్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవై నేతృత్వంలోని ధర్మాసనం ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. జగదీశ్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు.

విధినిర్వహణలో జర్నలిస్టులపై దాడులు: హరీష్ రావు

తొలి అక్షరం/హైదరాబాద్,ఆగష్టు 29 :విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులను అడ్డుకోవడం, మీడియాపై దాడి చేయడం కాంగ్రెస్ పాలనలో నిత్యకృత్యమైంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మొన్న సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడి ఘటన మరువకముందే.. నేడు హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడి ఇంటివద్ద మరో మహిళా జర్నలిస్టుకు అవమానం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. ప్రజా పాలన అని ప్రచారం చేసుకుంటూ, మీడియా స్వేచ్ఛను హరించడం సిగ్గుచేటు. మీడియా పై జరుగుతున్న వరుస దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మిలాద్-ఉన్- నబీ ఏర్పాట్లపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష

తొలి అక్షరం/హైదరాబాద్,ఆగష్టు 29 :హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్ ,శ్రీధర్ బాబు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్,ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ, ఉన్నతాధికారులు, వక్ఫ్ బోర్డు చైర్మన్, సభ్యులు, ఇతర ముస్లిం ప్రతినిధులు.

నేరాలను కట్టడి చేయాలంటే తప్పు జరిగిన వెంటనే శిక్ష పడాలి : సీతక్క

తొలి అక్షరం/హైదరాబాద్,ఆగష్టు 29 :ప్రస్తుతం హైడ్రాపై ఎలా చర్చ జరుగుతుందో మహిళల భద్రతపై చర్చ జరగాలన్నారు. మంత్రి సీతక్క. నేరాలను కట్టడి చేయాలంటే తప్పు జరిగిన వెంటనే శిక్ష పడాలన్నారు. నేరాలు జరగకుండా ఆలోచనలు సక్రమంగా ఉండాలంటే తరగతి గదుల నుంచే విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల ప్రభావం హత్యలకు కారణం అవుతోందన్నారు.పని ప్రదేశాల్లో మహిళలు క్షేమంగా ఉండాలని చెప్పారు. కోల్ కతా మహిళా డాక్టర్ ఘటన యావత్ దేశాన్ని కుదిపేసిందన్నారు. ఎక్కడైనా ఎవరిపైనా ఏ ఘటన జరిగినా ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలన్నారు. విమెన్ సేఫ్టీ వింగ్ తో కొన్ని సమావేశాలు ఏర్పాటు చేసి నేరాల కంట్రోల్ కు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠ్య పుస్తకాల్లో చట్టాల గురించి తెలియజేసేలా కృషి చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా గణేష్ ఉత్సవాలు...

(మొదటి పేజీ తరువాయి)

పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎటువంటి లోటుపాట్లకు తావు ఇవ్వొద్దని సీఎం హెచ్చరించారు. గణపతి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి గ్రేటర్ పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసులకు చెప్పారు. సెప్టెంబరు 16న మిలాద్ ఉన్ నబి,17న తెలంగాణలో వివిధ రాజకీయ పార్టీలు పలు కార్యక్రమాలు చేపడతాయని, అందువలన అన్ని కార్యక్రమాలకు సక్రమమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు.గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ముందుగా మండప నిర్వాహకులు ఉచిత విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, జవాబుదారీతనం కోసమే అనుమతి చేసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. మండపాల్లో డీజే సౌండ్లు వంటి అంశాల్లో సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ముందుకు వెళతామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావ, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మేయర్ గద్వాల విజయలక్ష్మి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైడ్రా అంటే ఓ డ్రామా: ఈటల..

(మొదటి పేజీ తరువాయి)

అల్వాల్, సరూర్ నగర్, సఫిల్‌గూడ చెరువుల సమీపంలో వందలాది పేద కుటుంబాల కన్నీళ్ల బాధ ఎవరికీ తెలియడం లేదని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. హస్మత్‌పేట చెరువు వద్ద 125 కుటుంబాలు, అల్వాల్ చెరువు వద్ద 120 కుటుంబాలు 1985లో పొట్టచేత పట్టుకొని వచ్చి ఇక్కడ 60 గజాలల్లో లేదా 40 గజాలల్లో భూమిని కొనుక్కున్నారన్నారు. ఈ కుటుంబాల వారు ధనవంతులు కాదని, కడు పేదవారు అన్నారు.గతంలోనూ సీఎంలు చెరువుల అభివృద్ధి కోసం పని చేశారన్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఈరోజే రాష్ట్రం ఏర్పడినట్లు వారే చెరువులను కాపాడుతున్నట్లుగా చేస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. ఏదో ఎన్-కన్వెన్షన్‌ను కూల్చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకొని పేరు తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కానీ చాలామందికి తెలియని విషయం ఏమంటే ఒకటో రెండో పెద్దవాళ్ల నిర్మాణాలు కూల్చేసి వందలమంది పేదవారికి నోటీసులు ఇచ్చారన్నారు.నోటీసులు రావడంతో ఇప్పుడు ఆ పేద కుటుంబాలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. వారు కార్పోరేటర్, ఎమ్మెల్యే, ఎంపీ వద్దకు పరుగు పెడుతున్నారన్నారు. ఇది పార్టీలకు సంబంధించిన పంచాయతీ కాదని, పేదవాళ్ల పంచాయతీ అన్నారు. హైడ్రా పేరుతో మీరు ఏం చేస్తున్నారో నాకు తెలియదు. కానీ ఇదో డ్రామా అని ముందే చెప్పొన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు, గుడిసెలు కూల్చివేస్తే ఖబడ్దార్ అని గతంలోనే హెచ్చరించానని గుర్తు చేశారు.పేదల జోలికి వెళ్లడం లేదని ముఖ్యమంత్రి, హైడ్రా కమిషనర్ చెబుతున్నారని, కానీ పేదలకు నోటీసులు ఎందుకు ఇచ్చారో వారు చెప్పాలని నిలదీశారు. మల్కాజ్‌గిరి లోక్ సభ పరిధిలోని వందల చెరువుల కింద ఉన్న పేదల కన్నీళ్ల బాధ గురించి తాను ఇదివరకే మాట్లాడానని ఇప్పుడు ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి ఈరోజు సుద్దపూసలా ధర్మాన్ని ఆయనే పునరుద్ధరిస్తున్నట్లుగా, ఛాంపియన్‌గా ఫోజులు కొడుతున్నారని చురక అంటించారు. పేదల జోలికి వస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఇక్కడ నివసిస్తున్న పేదలు కేవలం రేవంత్ రెడ్డినే కాదని అనేకమంది సీఎంలను చూశారన్నారు. అందరూ ఎన్ కన్వెన్షన్ గురించి మాట్లాడుతున్నారు. కానీ ఇన్నేళ్లుగా ఇక్కడ ఉంటున్న పేదల గురించి ఒక్కరూ మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల బాధను అర్థం చేసుకోవాలన్నారు.

పూర్తి స్థాయిలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు

● సబ్‌ప్లాన్ అమలుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

● దళిత గిరిజన జీవితాల్లో మార్పు వచ్చేలా చర్యలు

● ఉన్నతస్థాయి సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి

తొలి అక్షరం/హైదరాబాద్,ఆగష్టు 29 : ఎస్సీ ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని వంద శాతం పూర్తి స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు-ప్రణాళికల గురించి వివిధ శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చిన స్ఫూర్తిని కొనసాగించే విధంగా అధికారుల పని విధానం ఉండాలని దశ దిశా నిర్దేశం చేశారు. అన్ని శాఖల్లో ఉన్న అధికారులు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అర్థం చేసుకొని చట్టం ప్రకారం వారి నిధులను వారికే ఖర్చు పెట్టాలని సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సీరియస్‌గా అమలు చేయడానికి ఉన్నత అధికారులు సాధ్య సాధ్యాలను దృష్టిలో పెట్టుకొని మేధోమధనం చేసి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ఎలాన్ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశాన్ని అమలు చేసి దళిత గిరిజన జీవితాల్లో మార్పు తీసుకువస్తేనే ఆ చట్టానికి అర్థం, పరమార్థం ఉంటుందని అన్నారు.మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు దళిత, గిరిజనుల వ్యవసాయం కోసం కావలసిన నీటి వనరులను సమకూర్చడానికి బోర్లు వేయించాలని, భూగర్భ జలాలు పెరగడానికి చెక్ డ్యాముల నిర్మాణం చేయాలని చెప్పారు. పోడు సాగు చేసుకునే ఆదివాసి రైతులకు ఆదాయం వచ్చే విధంగా , అడవిని కాపాడుకునే విధంగా ఫామ్ ఆయిల్, పండ్ల తోటల పెంపకం, అంతర్గత పంటల సాగుకు డిజైన్ చేయాలని సూచించారు. అడవి ? ఆదాయం రెండు ఉండే విధంగా కొత్త పథకాలను తీసుకురావాలని సూచించారు. స్థానికులు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపు, నిధుల ఖర్చు గురించి అధికారులను అడిగి ఆరా తీశారు. గతం మాదిరిగా కాకుండా ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ఎ÷-లాన్ చట్టం ప్రకారంగా 24 శాతం నిధులు ఎస్సీ ఎస్టీల అభ్యున్నతి కోసం ఖర్చు పెట్టడానికి అధికారులు కచ్చితంగా దృష్టి సారించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించిన తర్వాత ప్రతినెల సబ్ ఎ÷-లాన్ చట్టం అమలు, నిధుల వ్యయంపై శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించి ఆర్థిక శాఖ నుంచి పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానీయా, ఎనర్జీ సెక్రెటరీ రోనాల్డ్ రోస్, సోషల్ వెల్ఫేర్ కమిషనర్ శ్రీదేవి, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి గౌతమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

SBI
The banker to e

రుణమాఫీ వాపస్ పేరుతో కొత్త డ్రామా

(మొదటి పేజీ తరువాయి)

నిరూపించుకోవాలా అని ప్రశ్నించారు. ఆడలేక మద్దెలు అద్దు అన్నట్టు రుణమాఫీ చెయ్యలేక రేవంత్ సర్కార్ నయా డ్రామా షురూ చేసిందన్నారు. మొన్న ఖమ్మంలో పింఛన్ వాపస్.. ఇప్పుడు రైతు రుణమాఫీలో వాపస్ ఆప్షన్ అంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు.'మాఫీకానీ రుణమాఫీ.. రైతులను అనుమానిస్తున్న రేవంత్ సర్కార్. సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతో కొత్త డ్రామా.. ఇచ్చేది పక్కన బెట్టి వాపస్‌పై దృష్టి. మొన్న ఖమ్మంలో ముసలవ్వ పింఛన్ వాపస్.. ఇప్పుడు రైతు రుణమాఫీలో వాపస్ ఆప్షన్. కేసీఆర్ రైతు రాజును రాజు చేస్తే.. మీరు అనుమానిస్తూ వేధిస్తున్నారు.ఇప్పటికే మాఫీపై మంత్రులు, ముఖ్యమంత్రి జూటా మాటలు అసత్య ప్రచారాలు. ఒక్క రుణమాఫీకి వంద కొర్రీలు.. సెల్ఫీ దిగి నేను రైతును అని రైతు నిరూపించుకోవాలా?. ఆడలేక మ్దదెలు అడ్డు అన్నట్టు రుణమాఫీ చెయ్యలేక రేవంత్ సర్కార్ నయా డ్రామా షురూ. వద్దురా నాయన కాంగ్రెస్ పాలన' అంటూ ట్వీట్ చేశారు.

హైడ్రా కోరలు మరింత పదను

● మరిన్ని అధికారాల అప్పగింత దిశగా ప్రభుత్వం

● ఉన్నతస్థాయి సమీక్షలో సిఎస్ శాంతి కుమారి

తొలి అక్షరం/ హైదరాబాద్, ఆగష్టు 29 :ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తి స్థాయిలో హైడ్రాకు అప్పగించేందుకు విధి విధానాలను రూపొంది స్తున్నట్టు సిఎస్ శాంతికుమారి తెలిపారు. చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై గత కొన్ని రోజులుగా రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా,ఓ.ఆర్.ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతో పాటు అన్ని చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై చర్చించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆస్తుల పరిరక్షణకై హైడ్రాకు మరిన్ని అధికారులను,సిబ్బందిని అప్పగించేందుకు చేపట్టాల్సిన్న చర్యలపై సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇంటలీజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, శాంతి భద్రతల విభాగం అడిషనల్ డీజీ మహేష్ భగవత్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ అడ్వకెట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి, ఎసిబి డైరెక్టర్ తరణ్ జోషి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ, పంచాయితీ రాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నారని, దీనిని నివారించటానికి, ఓ.ఆర్.ఆర్.పరిధిలో అన్ని విధాలా ఆక్రమణల తొలగింపు నోటీసులను హైడ్రా ద్వారానే చేపట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. జీ.హెచ్,ఎంసీ, ల్యాండ్ ఎంక్రోచ్‌మెంట్ ఆక్ట్, వాల్టా చట్టం, నీటిపారుదల శాఖ చట్టాల ద్వారా జారి చేసే అన్ని రకాల నోటీసులు, తొలగింపులన్నీ పూర్తిగా ఒకే విభాగం హైడ్రా పరిధిలోకి తేనున్నట్టు వివరించారు. హైడ్రాకు కావాల్సిన అదనపు అధికారులు, సిబ్బందిని త్వరలోనే కేటాయించనున్నట్టు తెలిపారు. ఎఫ్.టీ.ఎల్, నాలా ఎంక్రోచ్మెంట్, , ప్రభుత్వ కాళీ స్థలాలు, పార్కుల పరిరక్షణ లను హైడ్రా పరిధిలోకి తేనున్నామని చెప్పారు. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువుల పరిరక్షణ కూడా జల మండలి నుండి హైడ్రా పరిధిలోకి తేనున్నామని వెల్లడించారు. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాట య్యాయని, వీటిని మరింత బలోపేతం చేయాడానికి కావాల్సిన పోలీస్, సర్వే, నీటిపారుదల శాఖల నుండి అధికారులు, సిబ్బందిని త్వరితగతిన కేటాయించనున్నట్టు సి.ఎస్. తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, రంగారెడ్డి జిలా కలెక్టర్ శశాంక, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొత్రు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి లు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు

● మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

తొలి అక్షరం/కరీంనగర్,ఆగష్టు 29 : కరీంనగర్‌లోని స్పోర్ట్స్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, స్పోర్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్‌లోని స్పోర్ట్స్ పాఠశాలలో ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ క్రీడా పాఠశాలకు ప్రభుత్వం నుంచి 25 లక్షల రూపాలను మంజూరు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌టీఎల్ కింద చెరువులు, నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన కట్టడాలపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో హైడ్రాను ప్రతి జిల్లాలో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఎంత వారినైనా ఉపేక్షించకుండా ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. గంజాయి సరఫరా చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

ముస్లింల వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● బిల్లుకు అస్సాం అసెంబ్లీ ఆమోదం

తొలి అక్షరం/గువాహటి:ఆగష్టు 29 : ముస్లింల వివాహ, విడాకుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అస్సాం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండింటి నమోదును తప్పనిసరి చేస్తూ అస్సాం శాసనసభ గురువారం బిల్లును ఆమోదించింది.సీఎం హిమంత మాట్లాడుతూ, గతంలో ఖాజీలు నిర్వహించిన వివాహాలు చెల్లుబాటు అవుతాయని, కొత్త చట్టం అమలులోకి వచ్చిన నాటి నుంచి వివాహాలను వారు నమోదు చేయరాదని, తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద రిజిస్ట్రేషన్ చేయాలని అన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణ పరామర్శించిన మాజీ ఎంపీపీ

తొలి అక్షరం/మరిపెడ,ఆగస్టు29: మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం గ్రామపంచాయతీ పరిధిలోని అజ్మీర తండా కు చెందిన మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అజ్మీరా నారాయణ కి ఇటీవల చికెన్ గున్య జ్వరం వచ్చి గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గుగులోతు అరుణ రాంబాబు రోజు వారి ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన ఇప్పుడున్న ఈ పరిస్థితుల వల్ల దోమలు ఎక్కువ అయ్యి విష జ్వరాలు వ్యాపిస్తున్నాయనీ అన్నారు. ముఖ్యంగా ఇప్పుడు ఎవరికి చూసినా డెంగ్యూ లేదా చికెన్ గునియా లాంటి వైరల్ జ్వరాలు అధికమవడంతో మండల ప్రజలు అందరూ జ్వరాలు సంక్రమించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు బంటు ఉపేందర్

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),ఆగస్టు29: మహబూబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం మన్నెగూడెం గ్రామంలో నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు బంటు ఉపేందర్ ఈ సందర్భంగా రాసమల్లు వీరన్న రాసమల్లు స్వరూప దంపతుల కుమారుడు అయినటువంటి రసమల్లు సంపత్ పెళ్లి కుమార్తె ప్రవళికలు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. మన్నెగూడెం బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు సైదులు,బొమ్మ కంటి నాగ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ కానివారు రైతు వేదికలో కుటుంబ సభ్యుల ఆధార్ నమోదు చేసుకోవాలి: ఏఓ స్వామి

తొలి అక్షరం/పెద్ద వంగర,ఆగస్టు29: మండలంలో తెల్ల రేషన్ కార్డు లేకుండా, రేషన్ కార్డు మ్యాపింగ్ కాకుండా రెండు లక్షల లోపు రుణమాఫీ కాని సంబంధిత రైతుల రుణమాఫీ కావాలంటే వారి యొక్క కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం వ్యవసాయ అధికారులకు వారికి సంబంధించినటువంటి ఆధార్ కార్డుల వారి కుటుంబ వివరాలు, రైతు ధృవీకరణ పత్రము వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో సంతకం చేసి గ్రామ పంచాయతీ సెక్రెటరీ చే ధ్రువీకరణ చేయాల్సి ఉంటుంది వ్యవసాయ అధికారికి కేటాయించిన ప్రత్యేక క్రాప్ లోన్ వేవర్ యాప్ లో పొందుపరిచి రైతు కుటుంబంతో వ్యవసాయ అధికారి సెల్ఫీ ఫోటో దిగి యాప్ లో అప్డేట్ చేయాల్సి ఉంటుంది. కావున ధ్రువీకరణ చేసుకోవలసిన రైతులు వారి యొక్క కుటుంబ సభ్యులతోపాటు వారి యొక్క ఆధార్ కార్డు జిరాక్సు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ ధ్రువీకరణ పత్రంతో జత చేసి వ్యవసాయ అధికారులచే మండల కేంద్రం లో రైతు వేదిక వద్ద వారి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయించి అప్డేట్ చేయించుకోగలరని మండలం వ్యవసాయ అధికారి స్వామి తెలిపారు.

సుబ్లేడు గ్రామంలో పేకాట స్థావరాలపై దాడి పేకాటరాయుళ్ల అరెస్టు

- ఎస్సై కూచిపూడి జగదీష్

తొలి అక్షరం/తిరుమలాయపాలెం,ఆగస్టు29: తిరుమలాయ పాలెం మండల పరిధిలోని గ్రానైట్ క్వారీలో నమ్మకమైన సమాచారం మేరకు సుబ్లేడు శివారులో గల మూతపడ్డ క్వారీ నందు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తిరుమలా యపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ తమ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న వంగా లక్ష్మణ్, లంజపల్లి ప్రభాకర్, అనంతుల యోహాన్, కాళ్ళ నవీన్, గంధసిరి ఉమేష్ అను ఐదుగురు వ్యక్తులు సుబ్లేడు గ్రామానికి చెందినవారు. అట్టి వారిని పట్టుకొని వారి వద్ద నుండి 2500 రూ " నగదు, 4 ఫోన్లు స్వాధీనపరచుకొని వారిపై కేసు నమోదు చేయడమైనది.

ప్రజాపాలన దరఖాస్తులలో పొరపాటున తప్పులు ఉంటే సరిచేయాలి

- కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య

తొలి అక్షరం/మరిపెడ,ఆగస్టు29: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన పేరుతో జనవరి నెలలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ చేపట్టిందని,ఈ దరఖాస్తులలో అనేక తప్పులు దొర్లినట్లు వెలుగులోకి వస్తున్నాయని వీటిని వెంటనే సవరించాలని కులవివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) మహబూబాద్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మరిపెడ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ముందు ప్రజాపాలన దరఖాస్తుల లబ్ధిదారులతో కలిసి జిన్నా లచ్చయ్య మాట్లాడారు..6గ్యారంటీల పథకం అమల్లో భాగంగా ప్రజల నుండి వేలాది దరఖాస్తుల ప్రభుత్వం తీసుకుందన్నారు.ఈ సందర్భంగా దానిని ఆన్లైన్ చేసే సందర్భంలో డేటా ఆపరేటర్ల లేదా దరఖాస్తుదారులు ఫారం సక్రమంగా నింపక పోవడం వలన ఆన్లైన్లో నమోదు చేసిన వారికి కొన్ని తప్పులు దొర్లినట్లు తెలుస్తుందన్నారు.దాని ఫలితంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వర్తింపకవటం లేదని లచ్చయ్య ఆవేదన వ్యక్తం

చేశారు.దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు రోజు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారని, అయినా పరిష్కారం కావడం లేదని తెలిపారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు ప్రభుత్వం ఇస్తున్నప్పటికీ అది పేదవాడికి వర్తింపగాక చాలామంది లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ సబ్సిడీలు లబ్ధిదారులకు అందడం లేదని, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ అట్లాగే మండల పరిషత్ కార్యాల చుట్టూ లబ్ధిదారులు తిరుగు తున్న కొంతమందికి అసలు సబ్సిడీలే రావటం లేదని కాగితాలు పట్టుకొని కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పట్టించుకునే నాధుడు లేరని ఆరోపించారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాధితులకు ప్రత్యేక కౌంటర్ పెట్టిన,ఆ సమయంలో సర్వర్ పనిచేయకపోవడం, లేక సమందిత అధికారి అందుబాటులో లేకపోవడం తో సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ద్వారా తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులలో ఉన్న లోపాలను పూర్తిస్థాయిలో సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు.లేకుంటే చాలామంది లబ్ధిదారులు మహాలక్ష్మి ,గృహజ్యోతి లాంటి పథకాలకు అర్హులు కాకుండా పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు వాంకుడోత్ సాలి, వాంకుడోత్ చౌలి,వాంకుడోత్ శాంతి,బానోతు మగ్గి, లావుడ్యా పద్మ తదితరులు ఉన్నారు.

గుడికి 80వేల ఆర్థిక సాయం అందిస్తా అన్న మాజీ సర్పంచ్ నూకల కిషన్ రెడ్డి

- సవర్ లచ్చమ్మ గుడికి నూతన స్లాబ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయండి - గుడిని పరిశీలించిన నూకల కిషన్ రెడ్డి మాజీ ఎంపిటిసి రజితచిరంజీవి

తొలి అక్షరం/మరిపెడ,ఆగస్టు29: మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపూడి గ్రామంలో ఎస్సీ కాలనీలో కుల దేవత అయినటువంటి సవార్ లచ్చమ్మ గుడి నిర్మాణ పనుల కోసం ఎస్సీ కాలనీ వాసులు అందరూ కలిసి గ్రామ మాజీ సర్పంచ్ నూకల కిషన్ రెడ్డిని కలిసి గుడికి సంబంధించిన వివరాలు తెలియజేసి గుడికి మీ వంతు ఆర్థిక సహాయం చేయాలి అని కాలనీ వాసులు అడగగా వెంటనే స్పందించిన నూకల కిషన్ రెడ్డి కాలనీలో ఉన్నటువంటి సవార్ లచ్చమ్మ గుడికి వచ్చి గుడిని పరిశీలించి తప్పకుండా నా వంతు సహాయంగా ఒక 80 వేల రూపాయలు ఆర్థిక సహాయం తప్పకుండా చేస్తా అని హామీ ఇచ్చారు.గుడికి

సంబంధించిన మరమ్మత్తులు స్లాపు కొరకు వినియోగించుకోండి అని చెప్పాడు దీంతో అక్కడ ఉన్నటువంటి కాలనీవాసులందరూ సంతోషం వ్యక్తం చేశారు అడగగానే ఆర్థిక సహాయం చేస్తా అన్నందుకు ప్రజలందరూ సంతోషించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూకల కిషన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పులుసు రజిత,చిరంజీవి,వార్డు మెంబర్ బోడపట్ల రవి,వడ్లకొండ వెంకన్న,మహేష్, వడ్లకొండ రవి,శ్రీకాంత్,ఎస్కే యాకుబ్ కాలనీవాసులందరూ పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల అధికారి జిల్లాల కలక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

- వచ్చే స్థానిక ఎన్నికలు పకడ్బందీ వ్యూహంతో నిర్వహించాలి - రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

తొలి అక్షరం/మానుకోట,ఆగస్టు29: రాష్ట్ర ఎన్నికల సంఘం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల కమిషనర్ పార్థసారథి స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు,స్థానిక సంస్థలు,రెవెన్యూ,అదనపు కలెక్టర్లు,జిల్లా పంచాయితీ అధికారులు,జడ్పీ సీఈవోలు,రెవెన్యూ డివిజనల్ అధికారులు, సంబధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ మొదటి అంతస్తులోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు)లెనిన్ వత్సల్ టోప్పో(రెవెన్యూ) డేవిడ్,లతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేట్ ఎలక్షన్ కమిషనర్ సి.పార్థసారథి మాట్లాడుతూ,వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముందుగా మూడు దశలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని,అనంతరం ఎంపీటీసీ, జెడ్పిటీసీ ఎన్నికలు,చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పకడ్బందీగా దృష్టిని కేంద్రీకరించాలని,జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షణ జరపాలని సూచించారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, పార్టీలకు అతీతంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు సున్నితత్వంతో కూడుకుని ఉంటాయని, ఏమాత్రం అజాగ్రత్తకు తావివ్వకుండా, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ తెలిపారు.ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు.సెప్టెంబర్ 6న ఓటరు జాబితా

డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, సెప్టెంబర్ 21న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందన్నారు. తుది ఓటరు జాబితాను వెలువరించడానికి ముందే క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని,ఏవైనా మార్పులు, చేర్పులకు సంబంధించిన అభ్యర్థనలు వస్తే వాటిని పరిశీలించి ఓటరు జాబితాలో చేర్చే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు.ఏ చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా ప్రతీ దశలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యానికి తావివ్వకూడదని జాగ్రత్తలు సూచించారు. పంచాయతీరాజ్ చట్టం-2018 తో పాటు,స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలని,ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా రూపొందించుకోవాలని,అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా,పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించాలని అన్నారు.సమస్యాత్మక,అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో,పూర్తి పారదర్శకంగా,నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు.ఎంపిడిఓలు తమతమ మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించేలా చూడాలన్నారు.ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 వరకు ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని,ఓటర్ల సంఖ్య 650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలని,ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓటు ఒకేచోట ఉండేలా ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రతిఒక్కరు తమతమ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని, అలసత్వాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు.బ్యాలెట్ బాక్సులు,ఇతర ఎన్నికల సామాగ్రిని సమకూర్చుకోవాలని,ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి,వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని,ర్యాండమైజెషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలలో విధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లా పంచాయతీ కార్యాలయాలతో పాటు మండల స్థాయిలోనూ ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్ లను నెలకొల్పి,ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించేలా చూడాలని ఎన్నికల కమిషనర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈవో నర్మదా,రెవెన్యూ డివిజనల్ అధికారులు తొర్రూర్,మహబూబాబాద్ నరసింహారావు,అలివేలు,జిల్లా పంచాయితీ అధికారి హరి ప్రసాద్, డివిజనల్ పంచాయితీ అధికారి కనకదుర్గ,తదితరులు పాల్గొన్నారు.సమాచార పౌర సంబంధాల శాఖ,మహబూబాబాద్ జిల్లా వారిచే జారీచేయనైనది.

నెక్కొండ తహసిల్దార్ ఆఫీస్‌లో సిసి రోడ్ పనులను ప్రారంభించిన సొంటి రెడ్డి

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),ఆగస్టు29: మండల కేంద్రంలోని తాసిల్దార్ ఆఫీస్‌లో సిసి రోడ్డు పనులను ప్రారంభించిన నర్సంపేట నియోజకవర్గ టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి ఈ కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,నెక్కొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, రామాలయం గుడి చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గై లక్ష్మణ్, ఓబిసి మండల్ అధ్యక్షులు మాదాటి శ్రీనివాస్, అడ్వకేట్. బండిశివకుమార్, ఈదునూరి సాయి కృష్ణ, ఎస్.కె షబ్బీర్, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, వరంగల్ ఎన్ ఎస్ యు ఐ జిల్లా ప్రెసిడెంట్ బోడ శ్రీకాంత్ నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మచ్చవీరన్న,ఎండిఅన్వర్,చెన్నారెడ్డి,బొడ్డుపల్లి యాదగిరి, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ మండల సభ్యత్వం నమోదు కార్యక్రమం

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),ఆగస్టు29: భారతీయ జనతా పార్టీ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమ వర్క్ షాప్ ను నర్సంపేట నియోజక వర్గం లో దుగ్గొండి మండల కేంద్రములో నిర్వహించడం జరిగింది..దుగ్గొండి మండల అధ్యక్షులు నెదురు రాజేం దర్.ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథి గా బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.జాతీయవాదాన్ని సిద్ధాంతం గా,దేశ రక్షణను లక్ష్యంగా భావించి ముందడుగు వేస్తున్న భారతీయ జనతా పార్టీ తలపెట్టిన 2024 సభ్యత్వ నమోదు మహాయజ్ఞంలో చేరి వికసిత భారత్ నిర్మాణంలో భాగస్వాములు అవ్వండి. అని పిలుపునిచ్చారు అలాగే.సెప్టెంబర్ మొదటివారం నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు జరుగుతా యని తెలిపారు.భారతీయ జనతా పార్టీ నాయకులు అందరూ సమన్వ యంతో పనిచేసి దుగ్గొండి మండలంలో అధిక సంఖ్యలో సభ్యత్వాలు చేయాలన్నారు.ప్రతి పోలింగ్ బూత్ లో 200 సభ్యత్వలకు తగ్గకుండా చేయాలని రాష్ట్ర పార్టీ ఆదేశించిందని తెలిపారు.100 సభ్యత్వాలు చేసిన వారికే క్రియాశీల సభ్యత్వం వస్తుందని ప్రతి ఒక్కరూ ప్రతి పోలింగ్ బూత్ లో సభ్యత్వాలు చేయాలన్నారు... గ్రామాలలో నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులుగా ఎన్నుకో బడాలంటే పార్టీ ద్వారా ప్రజా సమస్యలపై పోరాడాలి.పార్టీ ద్వారా మనం చేసిన పోరాటాన్ని ప్రజలకు వివరించి సభ్యత్వాలు చేయాలన్నారు. కార్యక్రమం అనంతరం మండల కమిటీని ప్రకటిం చడం జరిగింది.మండల పార్టీ ఉపాధ్యక్షులుగా ముప్పారపు జగదీశ్, కాతరబాజీ చిరంజీవి, యాదగిరి నవీన్, ప్రధాన కార్యదర్శులుగా మొకిడే ప్రభాకర్, చెల్పూరి రాజు, కార్యదర్శిగా దూలం రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా నీలం రాజు, కక్కెర్ల నాగ రాజు,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులుగా కొండపాక మధు,ఎస్టి మోర్చా అధ్యక్షులుగా బానోతు వెంకటేష్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, మహబూబాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామ్ చందర్ రెడ్డి, సీనియర్ నాయకులు అన్న లింగన్న , నూతనకంటి శ్రీనివాస్,ఎడ్ల శశిధర్ రెడ్డి,వరంగల్ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, నర్సంపేట నియోజకవర్గ యు వ మోర్చా కన్వీనర్ ఆముదాల రమేష్,జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు పల్లకొండ శ్రీను,దుగ్గొండి మండల బి జే వైఎంఅధ్యక్షులు ఈర సందీప్, మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

తొలి అక్షరం/పర్వతగిరి,ఆగస్టు29: పర్వతగిరి మండల కల్లెడ గ్రామం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి భవనం నందు పర్వతగిరి మండల పరిధిలోని పలు గ్రామాలలోని కళ్యాణ లక్ష్మి, షాదిముభారక్ 45 లబ్బిదారులకు సుమారు 45లక్షల 5వేల 220 రూపాయల విలువ గల చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు.అనంతరం పర్వతగిరి మండల పరిధిలోని పలు గ్రామాలలో అనారోగ్యానికి గురైన వారు సిఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన 56 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు సుమారు 18 లక్షల 67వేల 565 రూపాయల విలువ గల చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు.. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేదలను అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల వరకు ఉన్న రుణమాఫీ చేసిన మన ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వం లక్ష్యం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.అలాగే మీకు ఏ సమస్య ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ నెంబర్ కి కాల్ చేసి మీ సమస్యను మాకు తెలియజేస్తే సత్వరమే పరిష్కరిస్తామని తెలియజే యడం జరిగింది.రుణమాఫీ కానీ రైతులు ఎవరు అధైర్య పడవద్దని ప్రతిపక్షాలు చెప్పే చెప్పుడు మాటలు పట్టించుకోవాలని మీకు ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకుని సమస్యను పరిష్కరిస్తాను హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మనోజ్ గౌడ్, పాక్స్ డైరెక్టర్లు మరియు జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోత్ భాస్కర్ ,జమాల్ పురం గ్రామ పార్టీ అధ్యక్షుడు జున్ను కనకయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు జిల్లా హరీష్, బండి సాయిలు, మండల నాయకులు పలు గ్రామాల అధ్యక్షులు వర్ధన్నపేట మండల పరిధిలోని జిల్లా, మండల, గ్రామ, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, యూత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల జాబితాను రూపొందించాలి

● ఎన్నికల సిబ్బందిని గుర్తించాలి ● రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి ● గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ జాబితా తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీసీలో స్టేట్ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి

State Election Commission

HANUMAKONDA DISTRICT

తొలి అక్షరం/హనుమకొండ ప్రతినిధి: ఆగస్టు 29 : గ్రామ పంచాయతీల వారీగా ఓటర్, పోలింగ్ స్టేషన్ల జాబితాను రూపొందించాలని స్టేట్ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి ఆదేశించారు. గ్రామ పంచాయతీల వారీగా ఓటర్, పోలింగ్ కేంద్రాల జాబితా తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీపీఓలతో హైదరాబాద్ నుంచి స్టేట్ ఎలక్షన్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి పనికి మాడ్యుల్ ఉందని, దాని ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. ఓటర్ జాబితా తయారీ, మ్యాపింగ్ పనులు చేసేందుకు ప్రతి మండలంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని సూచించారు. అన్ని మండలాల్లో కావాల్సిన అధికారులు, సిబ్బంది ఉన్నారో లేదో తెలుసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారు ఇచ్చిన ఓటర్ జాబితాకు అనుగుణంగా గ్రామాల వారీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో 600-650 మంది ఓటర్లు ఉండేలా చూసుకోవాలని, ఓటర్లను బట్టి కేంద్రాలను సిద్ధం చేయాలని తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా ఎదురైనా సమస్యలు గుర్తించాలని, మరోసారి రాకుండా చూడాలని ఆదేశించారు.**ఓటర్ జాబితా ప్రదర్శన..** వార్డుల వారీగా రూపొందించిన ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితాను 06-09-2024 తేదీన అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలని, 09-09-2024 జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలతో జిల్లా స్థాయి ఎన్నికల అధికారులు, 10-09-2024 తేదీన ఎంపీడీఓ ల ఆధ్వర్యంలో మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు 07-09-2024 నుంచి 13-09-2024 స్వీకరించాలని, ఆర్డీవో ల ఆధ్వర్యంలో వాటిని చేపట్టాలని సూచించారు. అభ్యంతరాలు 19-09-2024 తేదీలోగా జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పూర్తి చేయాలని, పూర్తి స్థాయి వార్డులు, ఫోటోలు, ఓటర్ల జాబితాను 21-09-2024తేదీన అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు.**జిల్లా కలెక్టర్‌కు ప్రశంసలు...** ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల వివరాలు ఎప్పటికపుడు అప్డేట్, రూపొందించడంలో ఉత్తమ ప్రతిభను చూపినందుకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ప్రశంసించారు. జిల్లాలో గ్రామపంచాయతీలు 208 ఉండగా, మొత్తం మెర్జింగ్ ప్రక్రియ 85 శాతం పూర్తి అయ్యిందని, మిగతా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 3, 73, 900 మంది ఉన్నారని వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్

తొలి అక్షరం/నర్సింహులపేట,ఆగస్టు29: క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్లో పాస్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో మహబూబాద్ జిల్లా స్థాయి క్రైస్తవ సేవకుల ఐక్యవేదిక సదస్సు నిర్వహించారు. ఈ సంచులు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ..జిల్లా మండల కేంద్రాలతో క్రైస్తవ సేవకుల ఐక్యవేదికకు కమిటీ హాల్, నమోదుల స్థలాలను, ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రాజేష్,ఉపాధ్యక్షుడు నిమ్మకాయల ప్రభుదాస్, గౌరవ సలహాదారుడు బాబురావు,కార్యదర్శి వీరన్న,సభ్యులు సతీష్, సామ్యేల్,రమేష్,దేవరాజు,రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం

తొలి అక్షరం/చిట్యాల, ఆగస్టు 29 : జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని జడల పేట ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు పాఠశాల విద్యార్థులకు క్రీడలు నిర్వహించామని ఇంచార్జ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు , పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లింగయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మధు మాట్లాడుతూ క్రీడాకారుడు ధ్యాన్చంద్ బర్త్ డేనే జాతీయ క్రీడా దినోత్సవం గా జరుపుకోవడం గొప్ప విషయమని తెలిపారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లింగయ్య మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరి సర్వతోముకాభివృద్ధికి తోడ్పడుతాయని ప్రతి ఒక్కరు ప్రతిరోజు ఆటలు ఆడాలని క్రీడల యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు. విద్యార్థులకు కబడ్డీ, కోకో ,బ్యాడ్మింటన్ ,క్యారమ్స్ చెస్ మొదలైన క్రీడలు ఆడించారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు వాసవి క్లబ్ తంగళ్లపల్లి రాజ భాస్కర్ , సంతోష్ , వాసవి క్లబ్ సభ్యులచే బహుమతి ప్రధానం చేయడం జరిగింది

బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎంపి డా. కడియం కావ్య..

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య

తొలి అక్షరం/హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 29 : న్యూశాయంపేటలో గల పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన శ్రావణ మాస బోనాల ఉత్సవాలకు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ కడియం కావ్య గారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండుగ నిలుస్తుందని ఆ అమ్మవారి దీవెనలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ అభిమానం మరువలేనిది

స్పోర్ట్స్ డే సందర్భంగా యువ షూటర్ మను బాకర్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత యువ షూటర్ మను బాకర్ రెండు పతకాలు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. గురువారం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా 2018లో జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం గెలిచినప్పుడు, టోక్యో ఒలింపిక్స్‌లో చేదు అనుభవం ఎదురైన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో వ్యక్తిగతంగా జరిగిన సంభాషణలను ఆమె పంచుకుంది. అదేవిధంగా క్రీడాకారులపై ఆయనకు ఉన్న అభిమానాన్ని కొనియాడింది. 2018లో జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో మను బాకర్ బంగారు పతకం సాధించింది. ఆ సమయంలో మొదటిసారిగా ప్రధాని నరేంద్ర మోదీని కలిసే అవకాశం లభించింది. ఆ సమయంలో మోదీ పంచుకున్న విషయాలను వెల్లడించింది.'నువ్వు ఇంకా చిన్నదానివి. భవిష్యత్తులో మరిన్ని విజయాలు మీరు అందుకుంటారు. మీకు ఏ అవసరం ఉన్నా నన్ను కలవచ్చు' అని మోదీ పేర్కొన్నారని తెలిపింది. ఇక, టోక్యో ఒలింపిక్స్‌లో ఎదురైన చేదు అనుభవం సమయంలో ఆయన మాటలు తనకు ఎంతో ప్రొత్సాహం ఇచ్చాయని, ఆ ప్రోత్సాహంతోనే తన భవిష్యత్తుకు ప్రణాళిక మొదలయ్యిందని మను పేర్కొంది. తన లక్ష్యంపై దృష్టి సారించాలని ఆయన సూచించారని వివరించింది. అదేవిధంగా ఆయన ప్రతి అథ్లెట్ గురిం చి ఎంతో శ్రద్ధ తీసుకుంటారని కొనియాడింది. విజయాలకు సంబరాలు చేసుకోవడంతో పాటు ఫలితాలతో సంబంధం లేకుండా ప్రతి క్రీడాకారుడితో ఆప్యాయంగా మాట్లాడతారని వివరిచింది. అందరితో వ్యక్తిగతంగా చర్చించి.. వారి సమస్యలు తెలుసుకుని వారిని ప్రోత్సహిస్తారని వెల్లడిం చింది. అయితే, టోక్యో ఒలింపిక్స్ సమయంలో భారత్ తరఫున బరిలో నిలిచిన మను బాకర్‌కు నిరాశ ఎదురైంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫికేషన్ మధ్యలో ఆమె పిస్టల్ మొరాయిం చడంతో.. పోటీ నుంచి బయటకు రావాల్సి వచ్చింది. దీంతో ÷నైల్‌కు చేరుకోలేకపోయింది. అయితే ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించి అరుదైన ఘనత సాధించింది.

ఐపిఎల్‌పై అప్పుడే ఊహాగానాలు

- రోహిత్ శర్మ ఎటువైపు అంటూ చర్చలు

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 గురించి అప్పుడే చర్చ జరుగుతోంది. ఏ జట్టులో ఓ బ్యాట్స్ మెన్ ఉంటారు. ఏ బౌలర్ ఉంటారు. టీమ్‌కు కెప్టెన్‌గా ఎవరు ఉంటారనే డిస్కషన్ జరుగుతోంది. గత సీజన్‌లో ముంబై జట్టుకు హార్దిక్ పాండ్యాను కెప్టెన్ చేయడం కీలక పరిణామం. ఆ సమయంలో రోహిత్ శర్మ అభిమానులు కామెంట్లతో సోషల్ మీడియాను షేక్ చేశారు. నెక్ట్స్ ఇయర్ ముంబైకి ఆడొద్దని సూచిస్తున్నారు. అదలా ఉండగానే రోహిత్ ముంబై జట్టు తరఫున ఆడరని, మరో జట్టుకు వెళతారనే ప్రచారం జరుగుతోంది. రోహిత్ శర్మ పంజాబ్ జట్టు తరఫున ఆడతారనే ఊహాగానాలు వచ్చాయి. లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడతారని ప్రచారం జరుగుతోంది. మరో అడుకు ముందుకేసి రోహిత్ శర్మను కొనుగోలు చేసేందుకు లక్నో జట్టు రూ.50 కోట్లు కేటాయించిందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే అంశాన్ని స్పోర్ట్స్ టాక్‌లో యాంకర్ ఎల్‌ఎస్‌జీ ఓనర్ హర్ష గోయెంకాను ప్రశ్నించారు. అందుకు గోయెంకా తెలివిగా సమాధానం ఇచ్చారు. 'మీరు చెప్పండి.. రోహిత్ శర్మ, లేదంటే ఇతరులు వేలానికి వస్తున్నారో లేదో.. మీకు తెలుసా.. ఏ కారణం లేకుండానే ఊహాగానాలు వస్తున్నాయి. అసలు ముంబై ఇండియన్స్ రోహిత్ శర్మను వదులకుంటుందా.. రోహిత్ శర్మ పేరు వేలంలో ఉంటుందా.. ఒకవేళ రోహిత్ శర్మ వేలంలోకి వస్తే.. అతని కోసం రూ.50 కోట్లు వెచ్చించొచ్చా.. మరి మిగిలిన ఆటగాళ్ల సంగతి ఎలా అని' యాంకర్‌ను ఎదురు ప్రశ్నించారు. 'ఆ ప్రశ్నకు గోయెంకా సూటిగా సమాధానం చెప్పలేదు. జట్టులోకి బెస్ట్ ప్లేయర్‌ను తీసుకోవాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది. మంచి ఆటగాడు కావాలి, మంచి కెప్టెన్ కావాలని ప్రతి ఒక్కరు అనుకుంటారు. మనం కోరుకోవడం కాదు.. మనకు అందులో ఉన్నది ఏదనేది ముఖ్యం. ఉన్న దాంతో సంతృప్తి పరచుకోవాలి. ఇదే విషయం నేను కోరుకుంటాను. నేను కాదు ప్రతి ఫ్రాంచైజీ ఓనర్ ఇలానే భావిస్తారు. అన్ని కావాలంటే ఎవరు పొందలేరు అని' గోయెంకా స్పష్టం చేశారు. జట్టులోకి రోహిత్ శర్మను తీసుకోవాలని గోయెంకా పరోక్షంగా కోరుకుంటున్నారు. పైకి మాత్రం ఇలా మాట్లాడుతున్నారని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.



జాతీయ క్రీడల దినోత్సవం

- స్పెషల్ వీడియోతో విషెస్ తెలిపిన ప్రధాని

న్యూఢిల్లీ: జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. ఈమేరకు ప్రత్యేకంగా ఓ వీడియోను తన సోషల్ మీడియాలో మోదీ పోస్టు చేశారు. పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్లిన అథ్లెట్లతో సంభాషించిన వీడియో అందులో ఉంది. 'భారత్ కోసం క్రీడల్లో పాల్గొన్న ప్రతీ క్రీడాకారుడికి అభినందనలు చెప్పేందుకు ఇంతకుమించిన మంచి తరుణం మరొకటి ఉండదు. మా ప్రభుత్వం క్రీడలకు మద్దతుగా నిలుస్తూ.. యువతకు ప్రోత్సాహం ఇచ్చేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుంది. తమకిష్టమైన క్రీడల్లో రాణించేలా అండగా నిలుస్తాం' అని మోదీ వెల్లడించారు. ఇకపోతే..ఇవాళ మన జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా అథ్లెట్లు, కోచ్‌లతోపాటు ప్రతిఒక్కరికీ శుభాకాంక్షలు చెబుతున్నా. క్రీడలనే తమ జీవితంగా మార్చుకున్నవారికి అంకితం. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవాలి. అంతర్జాతీయంగా క్రీడల్లో భారత్‌ను శక్తివంతంగా మారుద్దాం అని బీసీసీఐ కార్యదర్శి జైషా అన్నారు. 'క్రీడలు ఎంత ముఖ్యమో ఈ రోజును చూస్తే అర్థమవుతోంది. హాకీ ప్లేయర్‌గా హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. ఇవాళ్టి రోజును జాతీయ క్రీడల దినోత్సవంగా సెలబ్రేషన్ చేయడం గర్వంగానూ ఫీలవుతున్నా. ఏ క్రీడనైనా ఇష్టంగా ఆడితే విజయం సాధించడం పెద్ద కష్టమేం కాదు. మీరు ఆస్వాదించలేకపోతే అది క్రీడగా కాకుండా ఓ వ్యాపారంగా భావిస్తారు. ప్రాథమిక అంశాలను నేర్చుకోవడంపై ఎక్కువ సమయం వెచ్చించాలి. కఠినమైన సాధన చేయాలని భారత జూనియర్ హాకీ టీమ్ కోచ్ శ్రీజేశ్ అన్నారు. 'కుమారుడిగా తండ్రి విగ్రహాన్ని ఆవిష్కరించే అదృష్టం దక్కడం అద్భుతం. ఆయన ప్రభావం దేశమొత్తం వ్యాపించి ఉంది. హాకీలో కొత్త సంప్రదాయాలకు నాంది పలికారు. ఆటగాడిగా, సైనికుడిగా, తండ్రిగా.. ఎన్నో పాత్రలను చక్కగా పోషించారు. ఈ క్షణం నాకెంతో గర్వంగా ఉంది. ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణకు సాయపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని , ధ్యాన్‌చంద్ కుమారుడు ఒలింపియన్ అశోక్ కుమార్ అన్నారు.

అంతర్జాతీయ క్రికెట్‌కు బరీందర్ శ్రాన్ వీడ్కోలు

న్యూఢిల్లీ,: అంతర్జాతీయ క్రికెట్‌కు మరో భారత ఆటగాడు వీడ్కోలు పలికాడు. వెటరన్ ఓపెనర్ శిఖర్ ధావన్(÷ూరతీరజీస ఆరజీలిజీని) రిటైర్మెంట్ ప్రకటించిన వారం కాకముందే ఫాస్ట్ బౌలర్ బరీందర్ శ్రాన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ ఎడమ చేతివాటం పేసర్ 31 ఏండ్ల వయసులో ఆటకు అల్విదా చెప్పాడు. టీమిండియా, ఐపీఎల్‌లో పలు ఫ్రాంచైజీలకు ఆడిన బరీందర్ సుదీర్ఘ కెరీర్‌కు గురువారం రిటైర్మెంట్ ప్రకటించాడు. గాయాల కారణంగా ఎక్కువ రోజులు క్రికెట్ ఆడలేకపోయిన అతడు ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. అతడు తన ఇన్‌స్టాలో ఏం రాసుకొచ్చాడంటే..? 'అధికారికంగా నేను క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నా. ఓ సారి నా క్రికెట్ ప్రయాణాన్ని చూసుకుంటే చాలా గర్వంగా ఉంది. 2009లో బాక్సింగ్ వదిలేసి క్రికెటర్ అయ్యాను.ఈ ఆట నాకు ఎన్నో మధురమైన జ్ఞాపకాలను కానుకగా ఇచ్చింది. ఫాస్ట్ బౌలింగ్ ఎంచుకోవడం ద్వారా నాకు ఐపీఎల్‌లో పలు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్య వహించే అవకాశం వచ్చింది. చివరకు 2016లో భారత జట్టుకు ఆడడం నాకు దక్కిన గౌరవం' అని బరీందర్ అన్నాడు. హర్యానాకు చెందిన బరీందర్ మొదట బాక్సర్ అవ్వాలనుకున్నాడు. కానీ, అనూహ్యంగా క్రికెట్ వైపు మళ్లాడు. 2009లో అతడు ఫాస్ట్ బౌలర్‌గా మారాడు. దేశవాళీ క్రికెట్‌లో మెరిసిన బరీందర్ ఐపీఎల్‌లోనూ అదరగొట్టాడు. నిలకడగా రాణించిన అతడు సెలెక్టర్ల దృష్టిలో పడి.. 2016లో టీమిండియా జెర్సీ వేసుకున్నాడు. అయితే.. అతడి దేశం తరఫున అతడి కెరీర్ ఎక్కవ రోజులు సాగలేదు. భారత జట్టు బౌలర్‌గా కేవలం ఆరు వన్డేలు, రెండు టీ20లకే పరిమితం అయిన అతడు 13 వికెట్లతో ఫర్వాలేదనిపించాడు. ఆ తర్వాత గాయాల బారిన పడిన బరీందర్ మళ్లీ జట్టులోకి రాలేదు. దాంతో, ఈ స్పీడ్‌స్టర్ ఐపీఎల్‌కే పరిమితం అయ్యాడు. తొలుత రాజస్థాన్ రాయల్స్‌కు ఆడిన అతడు 2019లో ఐపీఎల్ టైటిల్ గెలుపొందిన ముంబై ఇండియన్స్ జట్టులో సభ్యుడు. బరీందర్ ఆ తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ జట్లకు ఆడాడు.

లార్డ్స్‌లో రూట్ శతక ప్రభంజనం.. 'ఆల్ టైమ్ రికార్డు' సమం

సుదీర్ఘ ఫార్మాట్ అంటే చాలు పరుగుల వరద పారించే ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ శతక గర్జన చేశాడు. తనకెంతో ఇష్టమైన లార్డ్స్ స్టేడియంలో శ్రీలంక బౌలర్లను ఉతికేస్తూ 33వ సెంచరీ నమోదు చేశాడు. తద్వారా ఇంగ్లండ్ తరఫున అత్యధిక శతకాలు బాదిన రెండో బ్యాటర్‌గా రూట్ రికార్డు నెలకొల్పాడు. మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును సమం చేశాడు. ఓవైపు సహచరులు పెవిలియన్‌కు క్యూ కడుతున్నా.. పట్టుదల వీడకుండా ఆడుతున్న రూట్ డ్రింక్స్ బ్రేక్ సమయానికి రూట్ 128 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఫ్యాబ్ - 4 లో ఒకడైన రూట్ తనలో పరుగుల ఆకలి తగ్గలేదని నిరూపించాడు. శ్రీలంకతో సొంతగడ్డపై జరుగునత్న రెండో టెస్టు తొలి రోజే అతడు మూడంకెల స్కోర్ బాదేశాడు. లహిరు కుమార బౌలింగ్‌లో బౌండరీతో రూట్ టెస్టు కెరీర్‌లో 33వ సెంచరీ నమోదు చేశాడు. దాంతో, 32 సెంచరీలతో ఉన్న స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్‌లను రూట్ దాటేశాడు.

సిజిటీఏంఎస్‌ఈ క్రెడిట్ గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- బ్యాంకులలో ఖాతాదారులకు పరిశ్రమల స్థాపనకు రుణాలు ఇవ్వాలి

- జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఏ.సత్యనారాయణ

తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా,ఆగస్టు 29 :సిజిటీఏంఎస్‌ఈ క్రెడిట్ గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ సత్యనారాయణ అన్నారు.బ్యాంకర్లు ఎంఎస్‌ఎమ్‌ఈ మైక్రోస్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్ కింద ఖాతాదారులకు కోటి రూపాయల వరకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలనీ మహబూబాబాద్ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ సత్యనారాయణ అన్నారు. తొలి అక్షరం పత్రికలు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనేక విషయాలు వెల్లడించారు.పరిశ్రమల స్థాపన కోసం చిన్న సూక్ష్మ,మధ్యతరహా పరిశ్రమల స్థాపన కోసం రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు సిటిసిఎస్‌ఎం తో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆయన చెప్పారు.నిరుద్యోగ యువత పరిశ్రమల స్థాపించి ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సత్యనారాయణ కోరారు.రుణాలు తీసుకున్న లబ్ధిదారులు కూడా సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంకులో రుణ భారం పడకుండా చూడాలని ఆయన సూచించారు.

రొటీన్‌కు భిన్నంగా సరిపోదా శనివారం



ఎప్పటికప్పుడు జోనర్లు మారుస్తూ సినిమాలు చేస్తున్న కథానాయకుడు నాని 'అంటే... సుందరానికి' తర్వాత నాని – వివేక్ ఆత్రేయ కలిసి చేసిన చిత్రమిది. తొలి సినిమాతో మిశ్రమ ఫలితాన్ని సొంతం చేసుకున్న ఈ కలయిక. ఈసారి ఎలాంటి ప్రభావం చూపించింది. 'సరిపోదా శనివారం' కథేంటంటే..: సూర్య (నాని)కి చిన్నప్పట్నుంచీ కోపం ఎక్కువ. ఆ కోపాన్ని అదుపులో పెట్టడం కోసం తను చనిపోతూ ఓ మాట తీసుకుంటుంది తల్లి ఛాయాదేవి (అభిరామి). అప్పట్నుంచి వారమంతా ఎంతగా కోపం వచ్చినా నియంత్రించుకుంటూ, శనివారం మాత్రమే తన కోపానికి కారణమైన వాళ్ల పని పడుతుంటాడు. వారమంతా చిత్రగుప్తుడులా చిట్టా రాసుకుంటూ, శనివారం యముడిలా చెలరేగిపోతాడన్న మాట. దాంతో ఆ గొడవలు ఇంటిదాకా వస్తుంటాయి. తండ్రి (సాయికుమార్), అక్క (అదితి) ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ఎన్.ఎల్.ఐ.సిలో మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకున్న సూర్య చిట్టాలోకి సీఐ దయానంద్ (ఎస్.జె.సూర్య) చేరతాడు. తన సొంత అన్న కూర్మానంద్ (మురళీశర్మ)తోనే వైరం ఉన్న సీఐ దయానంద్ కథేమిటి?అతనికీ, సోకులపాలెం అనే ఊరికీ సంబంధమేంటి? దయానంద్‌పై సూర్యకు ఉన్న కోపం, సోకులపాలేనికి ఎలాంటి మేలు చేసింది? వీళ్ల కథలోకి చారులత (ప్రియాంక మోహన్) ఎలా ప్రవేశించింది? అన్నది చిత్ర కథ!వివేక్ ఆత్రేయ మార్క్ తెలివైన కథనంతో సాగే ఓ యాక్షన్ డ్రామా ఇది. విడుదలకు ముందు చిత్రబృందం కూడా కథ కంటే, ఆ కథని ఎలా చెప్పామన్నదే కీలకం అంటూ ప్రచారం చేసింది. అందుకు తగ్గట్టే బలమైన పాత్రలు, సంఘర్షణకి వైవిధ్యమైన కథనాన్ని మేళవించి 'సరిగ్గా సరిపోయింది' అనిపించేలా చిత్రాన్ని మలిచే ప్రయత్నం చేశాడు దర్శకుడు. ఏ కథ అయినా అమ్మ నుంచే మొదలవుతుందంటూ అమ్మ, ఆమె తన కొడుకు నుంచి తీసుకున్న మాటతోనే సినిమా ప్రారంభమవుతుంది. ఆ ఎపిసోడ్‌తోనే సినిమాకి ఈ పేరు ఎందుకో స్పష్టమవుతుంది. కథ, పాత్రల పరిచయంతో కూడిన ఆరంభ సన్నివేశాలు కాస్త నెమ్మదిగా అనిపించినా, దయా పాత్ర ప్రవేశంతో అసలు కథ ఊపందుకుంటుంది. సోకులపాలెంని ఓ వస్తువులా చూస్తూ, తన కోపాన్ని ఆ ఊరిపై చూపించే ఇన్‌స్పెక్టర్ దయ, అతనికి అన్నతో ఉన్న వైరం చిత్రంలో కీలకం. ఆరంభం, మలుపు, పీటముడి, మధ్యభాగం, ముగింపు అంటూ పార్శ్వాలుగా కథని చెప్పే ప్రయత్నం చేశాడు దర్శకుడు. మలుపు అంకం నుంచి సన్నివేశాలు ఆసక్తికరంగా సాగిపోతుంటాయి. ఆ క్రమంలోనే పరిచయమయ్యే చారులత, కూర్మానంద్ పాత్రలు... వాటి ద్వారానే అన్నదమ్ముల మధ్య సంఘర్షణ, సోకులపాలెం కథలు వెలుగులోకి వచ్చే క్రమం ప్రేక్షకుడిని సినిమాలో లీనం చేస్తాయి. సూర్య, చారులత ప్రేమకథలో వచ్చే ఈగ స్టోరీ నవ్విస్తుంది. సినిమాలో కీలకమైన ప్రతి పాత్ర వెనకా ఓ కథ ఉంటుంది. ఆ కథల్ని వివరించే క్రమంలో కొన్ని సన్నివేశాలు నెమ్మదిగా సాగుతున్న భావన కలిగినా, పీటముడి, మధ్యభాగం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లాయి. సూర్య, చారులత దగ్గరయ్యే సన్నివేశాలు... చారులతకి సూర్య తన శనివారం సంగతిని చెప్పాలనుకోవడం, ఆ క్రమంలోనే వచ్చే యాక్షన్ ఎపిసోడ్, విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై మరిన్ని అంచనాల్ని పెంచాయి. అప్పటి నుంచి కథ సూర్య వర్సెస్ దయా అన్నట్టుగా మారిపోతుంది. సోకులపాలెంలో ధైర్యం నింపడం కోసం సూర్య, చారు కలిసి ఓ వ్యూహాన్ని రచించడం, ఆ క్రమంలో అనూహ్యంగా చోటు చేసుకునే సంఘటనలు, సూర్య ఇంట్లో సాగే పోరాట ఘట్టాలు ఆకట్టుకుంటాయి. కోపం నలుగురిలో ధైర్యాన్ని నింపేలా ఉండాలంటూ పతాక సన్నివేశాల దిశగా సినిమా సాగుతుంది. నాని యాక్షన్ అవతారం ఆకట్టుకుంటుంది. సూర్య పాత్రలో ఒదిగిపోయాడు. ఉద్యోగిగా సహజ సిద్ధమైన లుక్, నటనతో ఒకవైపు అలరిస్తూనే, మరోవైపు కోపంతో రగిలిపోయే కోణాన్ని ప్రదర్శించాడు. ఎస్.జె.సూర్య పోషించిన ఇన్‌స్పెక్టర్ దయానంద్ పాత్ర సినిమాకి కీలకం. క్రూరత్వం ప్రదర్శిస్తూ, తన చూపులతోనే భయపెడుతూ విలనిజం ప్రదర్శించాడు. ఆ పాత్రకి సరైన ఎంపిక అని చాటి చెప్పారు. చారులత పాత్రలో ప్రియాంక మోహన్ అలరిస్తుంది. నా జడ్జిమెంట్ ఎప్పుడూ తప్పే అంటూ మురళీశర్మ తెరపై కనిపించిన విధానం, ఆయన పాత్ర సినిమాకి మరో ఆకర్షణ. సాయికుమార్, అదితి బాలన్, అభిరామి, హర్షవర్ధన్, మైమ్ మధు, అజయ్ తదితరులు కీలకమైన పాత్రల్లో కనిపించి మెప్పిస్తారు.

తారక రామారావుతో తెలుగమ్మాయి జోడీ

నందమూరి హరికృష్ణ మనవడు తారక రామారావు హీరోగా వై.వి.ఎస్. చౌదరి కొత్త సినిమా తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. 'న్యూ టాలెంట్ రోర్స్' పతాకంపై ఆయన సతీమణి గీత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో వీణారావు అనే తెలుగు అమ్మాయిని పరిచయం చేయనున్నారు. కీరవాణి దీనికి సంగీతం అందించనున్నారు. ఆ సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు పంచుకునేందుకు వై.వి.ఎస్. చౌదరి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఆ వివరాలివీ.. 'న్యూ టాలెంట్ రోర్స్' ఏర్పాటు చేసిన మూడో మీడియా సమావేశమిది. మొదటి మీటింగ్‌లో హరికృష్ణ మనవడిని పరిచయం చేయనున్నట్లు ప్రకటించాం. రెండో సమావేశంలో సంగీత దర్శకులు, రచయితల గురించి వెల్లడించాం. మూడో దాంట్లో ఈ సినిమా నేపథ్యాన్ని వెల్లడించాలని నిర్ణయించుకున్నాం. నాకు అక్కినేని నాగార్జున గారు గాడ్ ఫాదర్‌తో సమానం. ఆయన పుట్టినరోజు సందర్భంగా మూడోసారి మీడియా సమావేశంతో మీ ముందుకు వచ్చాం. హరికృష్ణ గారు నాకు సోదరుడితో సమానం. వీళ్లిద్దరితో 'సీతారామరాజు' తీశాను. ఆ సినిమా తీయడం నా అదృష్టం. తెలుగంటే హరికృష్ణ గారికి ఎంతో గౌరవం. తెలుగు భాష దినోత్సవం రోజునే ఆయన మనల్ని వదిలివెళ్లడం బాధాకరం. ఆయన ఎప్పటికీ నా గుండెల్లో ఉంటారు. ఆయన రుణం తీర్చుకోలేను. ప్రత్యేకించి నాకు తెలుగు భాష అంటే ఎంతో ఇష్టం. ఇక ఈ సినిమా 1980 నేపథ్యంలో రానుంది. తెలుగు భాషకు ఇందులో పెద్దపీట వేయనున్నాం. తెలుగు భాష గొప్పతనం గురించి ప్రేక్షకులకు చెప్పాలని ఎన్నో రోజులుగా అనుకుంటున్నా. దానికి సరైన కథ ఇప్పుడు దొరికింది. ఈ సినిమాకు నేపథ్యమే బలం' అని వై.వి.ఎస్. చౌదరి చెప్పారు.

ఫ్లాప్ అయినా భలేగా కలెక్షన్లు

- ఆదిపురుష్‌పై దర్శకుడు ఓం రౌత్

రెబల్ స్టార్ ప్రభాస్, బాలీవుడ్ నటి కృతి సనన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం ఆదిపురుష్ ఓం రౌత్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద అట్టర్‌ఫ్లాప్‌గా నిలిచింది. ఇక ప్రభాస్ రాధేశ్యామ్ తర్వాత మరో డిజాస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే తాజాగా ఈ సినిమా డిజాస్టర్‌పై దర్శకుడు ఓం రౌత్ స్పందించాడు. ఆదిపురుష్ అభిమానుల అంచనాలను అందుకోలేక పోయిందని అయితే ఈ సినిమా ఫ్లాప్ అందుకున్న బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ సాధించిందని తెలిపాడు. ఇక ఆదిపురుష్ విడుదలయిన అనంతరం తనపై వచ్చిన ట్రోల్స్‌పై స్పందిస్తూ.. సోషల్‌మీడియాలో ముక్కు, ముఖం తెలియని వాళ్లు చేసే ట్రోల్స్‌ను మనం పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఆదిపురుష్ బాక్సాఫీస్ వద్ద మంచిగా ఆడింది. ఈ సినిమా తొలిరోజే రూ.70 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఓవరాల్‌గా రూ.400 కోట్లకు పైగా కలెక్షన్స్‌ను రాబట్టింది. ఇందులో తెలంగాణ. ఆంధ్రా నుంచే రూ.200 కోట్ల వరకు వచ్చాయి. దీన్ని బట్టి చెప్పవచ్చు ఈ సినిమా హిట్ అయ్యిందా అనేది అంటూ రౌత్ చెప్పుకొచ్చాడు.

రాజమౌళితో సినిమా చేయాలనుంది

- నటుడు విక్రమ్ వెల్లడి

విక్రమ్ తాజా సినిమా 'తంగలాన్' విడుదలైన అన్ని ప్రాంతాల్లో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఈ సినిమాను బాలీవుడ్‌లోనూ విడుదల చేయనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన డబ్బింగ్ పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 6న 'తంగలాన్' బీటౌన్‌లో విడుదల కానుంది. ఈనేపథ్యంలో ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఒకే రకమైన పాత్రలంటే ఆసక్తి ఉండదు. ఒకవేళ నేను అలా చేస్తే నా అభిమానులు నిరాశ పడతారు. అలాంటి చిత్రాలు కమర్షియల్‌గా హిట్ అయినప్పటికీ ఒకేతరహా పాత్రలనే ఎందుకు ఎంచుకుంటున్నారని మీడియా కూడా నన్ను ప్రశ్నించే అవకాశం ఉంది. అది నా శైలికి భిన్నం. అందుకే ప్రతి సినిమాకు కొత్తరకంగా ప్రయత్నిస్తాను. ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది నటీనటులు మాత్రమే ఇలా భిన్నంగా ప్రయత్నిస్తుంటారు. నా సినిమా వస్తుందంటే నా అభిమానులు కొత్తదనాన్ని కోరుకుంటారు. నా చిత్రాలు 'అపరిచితుడు', 'పొన్నియిన్ సెల్వన్' హిందీలో మంచి విజయాన్ని సాధించాయి. త్వరలో హిందీలో విడుదల కానున్న 'తంగలాన్'ను కూడా అదేస్థాయిలో ఆదరిస్తారని ఆశిస్తున్నా. నా అభిరుచికి సరిపోయే పాత్రలు వస్తే హిందీ చిత్రాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. అలాంటి స్క్రిప్ట్‌తో ఎవరైనా సంప్రదిస్తే ఆనందంగా అంగీకరిస్తాను. మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన పొన్నియిన్ సెల్వన్ భారీ ప్రేక్షకాదరణను సొంతం చేసుకోవడమే కాకుండా 4 జాతీయ అవార్డులను గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నాకు కూడా అవార్డు వచ్చిఉంటే ఇంకా సంతోషించేవాడిని. ఆ చిత్రం చరిత్రలో నిలిచిపోతుంది. మణిరత్నం దాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. రాజమౌళితో సినిమా గురించి చర్చలు జరిపిన విషయం వాస్తవమే. ఆయనతో సినిమా చేస్తాను. కానీ, దానికి సమయం పడుతుంది. భారతదేశంలోని అత్యంత గొప్ప దర్శకుల్లో రాజమౌళి ఒకరు. మేము సరైన స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నాం. నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో 'కోబ్రా' అత్యంత కష్టమైనది. కానీ, అది అనుకున్నస్థాయిలో ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేదు. ఒక నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. కొన్నిసార్లు సినిమాకు ప్రశంసలు వస్తాయి. కానీ, కలెక్షన్లు రావు. కోబ్రాలో నేను చేసిన ఎన్నో సన్నివేశాలు సవాలుగా అనిపించాయి.

తమిళ పరిశ్రమలో వేధింపులు ఉంటే చెప్పండి

- చర్యలు తీసుకుంటామన్న నటుడు విశాల్

STONE BENCH FILMS
புரட்சி தளபதி
விஷால்
ரத்னம்
ஹரி

మలయాళ సినీరంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగిక వేధింపుల పై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదిక అక్కడి ఇండస్ట్రీని కుదిపివేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమ్మ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్‌లాల్‌పాటు మొత్తం 17 మంది పాలక మండలి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. కమిటీలోని కొంతమంది సభ్యులపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో వారందరూ రాజీనామా చేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో కోలీవుడ్ నటుడు విశాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాలీవుడ్‌లో హేమ కమిటీ తరహాలలో కోలీవుడ్‌లో 10 మందితో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తాం. తమిళ చిత్ర పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ ఉన్నట్టు మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. కేరళలో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాగే తమిళనాడు నడిగర్ సంఘం ఆధ్వర్యంలో కమిటీ పెడతాం. నటీమణులు ఏవైనా సమస్యలు ఉంటే మాకు ఫిర్యాదు చేయండి. విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని విశాల్ స్పష్టం చేశాడు. కేరళలో మహిళలను వేధించిన వారికి శిక్ష పడాల్సిందే. మహిళలకు అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రతీ మగవారిపై ఉంటుందని సూచించాడు. మాలీవుడ్‌లో మహిళల లైంగిక వేధింపులతోపాటు పారితోషికాల్లో వివక్ష, షూటింగ్ లొకేషన్లలో కనీస సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హేమ కమిటీ నివేదికలో పేర్కొంది.